మహా పత్రిక
ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం
27-8-2025




## పర్యావరణ పరిరక్షణ దిశగా అడుగులు వేద్దాం



మట్టి విగ్రహాలతో వినాయకచవితి పండుగ జరుపుకోవండం ద్వారా పర్యావరణ పరిరక్షణ దిశగా అడుగులువేద్దామని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివ రావు అన్నారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కార్పొరేషన్ పరిధిలోని పలు సెంటర్లలో ఏర్పాటు చేసిన మట్టి విగ్రహాల పంపిణి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం కూనంనేని మాట్లాడారు.

## మహిళలు ఆర్థికంగా ఎదగాలి



మహిళలు లాభసాటి వ్యాపారాలను ప్రారంభించి ఆర్థికంగా బలోపేతం కావాలని, మరొకరికి ఉపాధి కల్పించే విధంగా అభివృద్ధి చెందాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మంగళవారం ఖమ్మం నగరం టేకులపల్లి లోని దుర్గాబాయి మహిళా, శిశు వికాస కేంద్రం మహిళా ప్రాంగణంను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సందర్శించారు. మహిళా ప్రాంగణం పరిసరాలను కలియ తిరిగిన కలెక్టర్, ప్రాంగణానికి కావలసిన మౌలిక సదుపాయాల గురించి మహిళా ప్రాంగణం మేనేజర్ ను అడిగి తెలుసుకున్నారు.

# విఘ్నేశ్వరుని ఆశీర్వాదం భక్తి వైభవం

## మోదక సువాసనలో మురిసే వినాయక చవితి

- విఘ్నేశ్వరుని ఆశీర్వాదం భక్తి వైభవం
- సాంస్కృతిక శోభతో వెలిగే గణనాయక పర్వదినం
- పల్లె నుంచి పట్నం దాకా కొలువు తీరిన గణపతి
- నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం



భాద్రపద శుద్ధ చతుర్థి నాడు జరుపుకునే వినాయక చవితి పండుగ ప్రతి తెలుగు హృదయంలో అపూర్వ ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తుంది. శుభారంభాలకు సంకేతమైన గణనాయకుని ఆరాధనతో జీవన మార్గంలోని ప్రతి విఘ్నం తొలగి పోతుందని విశ్వాసం. మట్టి విగ్రహాలను అలంకరించి, వేదమంత్రాలతో అవాహన చేసి, మోడకాలు-లడ్డూలతో నైవేద్య మర్పించడం ఈ పండుగలో ప్రధాన సంప్రదాయం.

## కవి చెప్పినట్లు

"గణనాథా నీ వందనములో
గాక భక్తుల మనోరథం నిండుము
నీ దయలతో పుడమి శాంతించు
నీ కరుణలోనే సత్యం వెలుగును"

## మట్టి గణేష్, ప్రకృతి పరిరక్షణ

ఇటీవలి కాలంలో వినాయక ఉత్సవాలు పర్యావరణహిత దిశగా మలుపు తిరిగాయి. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల నదులు కలుషితం అవుతున్న నేపథ్యంలో మట్టి విగ్రహాలకే ప్రాధాన్యం పెరిగింది. సహజ రంగులు, బయోడిగ్రేడబుల్ అలంకరణలు ఉపయోగించడం ప్రారంభమైంది.

ఖమ్మం,మహా



## ఎంపీ వద్దిరాజును కలిసిన మాజీ మంత్రి జోగు రామన్న

**ఖమ్మం, మహా:** బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రను మాజీ మంత్రి జోగు రామన్న నాయకత్వాన నిర్మల్ జిల్లా ముధోల్ మున్నూరుకాపు ప్రముఖులు కలిశారు.ముధోల్ నియోజకవర్గం మున్నూరుకాపు సంఘం అధ్యక్షులు రోళ్ల రమేష్, బీఆర్ఎస్ ముధోల్ నియోజకవర్గ బాధ్యులు డాక్టర్ కిరణ్ కొమ్రెవార్ ,వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ పిప్పర కృష్ణ,, సంఘం కుభీర్ మండల శాఖ అధ్యక్షులు సిద్ధంవార్ వివేకానంద,లోకేశ్వరం మండల శాఖ అధ్యక్షులు మంద లింగన్న, బాసర మండల శాఖ అధ్యక్షులు కోర్వ శ్యామ్, ప్రముఖులు తోట రాము,చిమ్మన్ పోశెట్టి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ వెన్నెల అనిల్ తదితరులు మాజీ మంత్రి జోగు రామన్న నేతృత్వంలో ఎంపీ వద్దిరాజును మంగళవారం బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పలు విషయాలపై చర్చించారు. జూబ్లిహిల్స్ టిక్కెట్ పై చర్చించారు.





# పడకేసిన పారిశుధ్యం వెలగని వీధి దీపాలు

## తక్షణమే సమస్యను పరిష్కరించాలని సిపిఎం డిమాండ్

**జూలూరుపాడు, ఆగస్టు 26, (మహా):** గ్రామ పంచాయతీ సర్పంచుల పదవీకాలం ముగిసి ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామాలలో సమస్యలు కుప్పలు తెప్పలుగా పేరుకు పోతున్నాయి అనడానికి ఇది ఒక ఉదాహరణ. మండల పరిధి కొమ్ముగూడెం గ్రామ పంచాయతీలో మంగళవారం మండల సిపిఎం పార్టీ బృందం పర్యటించడం జరిగింది. ఆ గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టక గ్రామంలోని డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, గ్రామంలో వీధి దీపాలు వెలగడం లేదని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కొండపల్లి శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాకాలం ప్రారంభమై నెలలు గడుస్తున్న నేటికీ గ్రామాలలో పారిశుద్ధ్యం పనులు ఎక్కడా జరగడంలేదని అన్నారు. తద్వారా ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారని అన్నారు. తక్షణమే అధికారులు స్పందించి గ్రామాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనియెడల పంచాయితీ కార్యాలయాలతో పాటు, మండల అభివృద్ధి కార్యాలయాన్ని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి యాస నరేష్, పార్టీ శాఖ సభ్యులు శంకర్, రవి, మంగ్య, చిన్నమంగ తదితరులు పాల్గొన్నారు.

# ఇండోర్ పర్యటనలో నేర్చుకున్న అభివృద్ధి విధానాలను ఖమ్మంలో అమలు చేస్తాం

**ఖమ్మం, మహా:** ఇండోర్ పర్యటనలో నేర్చుకున్న అభివృద్ధి విధానాలను ఖమ్మంలో అమలు చేస్తామని ఖమ్మం మేయర్ పూనకొల్లు నీరజ తెలిపారు. మంగళవారం ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయం మేయర్ ఛాంబర్ నందు ఇండోర్ స్టడీ టూర్ పై విలేకరుల సమావేశాన్ని ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ, ఉపమేయర్ ఫాతిమా జోహార . ఇండోర్ నగరానికి చేసిన స్టడీ టూర్‌లో అనేక విలువైన అనుభవాలను సొంతం చేసుకున్నాము. ఇండోర్ నగరం వరుసగా దేశంలోనే శుభ్రమైన నగరంగా అవార్డులు పొందింది. ఆ విజయానికి కారణం వారి క్రమశిక్షణ, పారిశుద్ధ్యంపై ప్రజల్లో పెంచిన అవగాహన, ఆధునిక సాంకేతికతను వినియోగించి తీసుకున్న చర్యలు. అక్కడ మేము గమనించిన ముఖ్యమైన అంశాలు వ్యర్థాలను వేరు చేయడం ప్రతి ఇంటి దగ్గర నుండి కచ్చితంగా అమలు చేయడం రీసైక్లింగ్ ద్వారా వ్యర్థాలను వనరులుగా మలచడం, ప్రజల భాగస్వామ్యాన్ని పెంచి శుభ్రతను ఒక ఉద్యమంగా తీర్చిదిద్దడం, గ్రీన్ ఎనర్జీ వినియోగం, సాంకేతిక పద్ధతులను. వెహికల్ ట్రాకింగ్ కంట్రోల్ రూమ్ వినియోగించడం ఇవి అన్నీ మన ఖమ్మం నగరానికి కూడా చాలా అవసరమైనవి. అందుకే, ఖమ్మం కార్పొరేషన్ ఈ అనుభవాలను ఇక్కడ అమలు చేసే దిశగా త్వరలోనే మన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు చర్యలు ప్రారంభిస్తున్నాము. త్వరలో మున్సిపల్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఎన్జీవోస్ కూడా ముందుకు వస్తే వారి భాగస్వామ్యం తో ప్రజల్లో అవగాహన పెంచే కార్యక్రమాలను చేపడతాము. మన ఖమ్మం ప్రజల సహకారం ఉంటే, ఖచ్చితంగా మన నగరాన్ని ఇండోర్ మాదిరిగా శుభ్రతలో పచ్చదనంలో, స్మార్ట్ సిటీ అభివృద్ధిలో ముందంజలో నిలపగలమని నమ్మకం ఉందన్నారు. నేడు జరిగే వినాయక చవితి సందర్భంగా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ మట్టి విగ్రహాలని ఆరాదించి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. ఈ సమావేశంలో వారితోపాటు 49, 3 వ డివిజన్ల కార్పొరేటర్లు దుద్దుకూరి వెంకటేశ్వరరావు, మలీదు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



# మిత్రమా.. జర జాగ్రత్త..

## గణేష్ ఉత్సవాలు చేస్తున్నారా..? ఇవి పాటించండి..

### భక్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసే సమయంలో భక్తులు తప్పకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

1) విగ్రహాలను తీసుకొచ్చేటప్పుడు విద్యుత్ తీగలకు తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

2) విగ్రహాలను వాహనాలపై నుంచి దింపేటప్పుడు, ఎక్కించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి

3) పూజలు చేసే సమయంలో దీపాలు కిందపడకుండా చూసుకోవాలి.. మంటలు అంటుకుని అగ్నిప్రమాదంగా మారే అవకాశం ఉంది.

4) మైకులు, బాక్సులకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చేటప్పుడు తీగలు కటింగ్ లేకుండా కాస్ట్ వైర్లను వాడాలి



**కూసుమంచి, మహా:** జిల్లా వ్యాప్తంగా బుధవారం వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. పల్లెపల్లెనా, వీధివీధిన భక్తులు గణేష్ మండపాలను సిద్ధం చేస్తున్నారు. అనేక రకాలుగా ఆకట్టుకునే విధంగా మండపాలను తయారు చేస్తున్నారు. స్థాయికి తగిన వినాయక విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. నవ రాత్రులు పాటు ఉత్సవాలను అంగరంగ వైభవంగా, భక్తి శ్రద్ధలతో పూజలు చేసే విధంగా భక్తులు సిద్ధమవుతున్నారు. అయితే మండపాలు తయారు చేసే సమయంలో కానీ, చేసిన తరువాత, నిమజ్జనం చేసే సమయంలో భక్తులు తగు జాగ్రత్తలు తీసుకోరు. దీని వల్లన పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉంటుంది. ఇప్పటికే అనేక సంఘటనలు జరిగిన పరిస్థితి ఏర్పడింది. అందుకే మహా పత్రిక కొన్ని జాగ్రత్తలను మీకు అందిస్తోంది.

### విద్యుత్ ఏర్పాటు పట్ల జాగ్రత్తలు తీసుకోండి..

గణపతి నవరాత్రి ఉత్సవాల నిర్వహణలో భాగంగా విద్యుత్ ప్రమాదాలు జరగకుండా గణేష్ మండపాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రతలు

1. విద్యుత్ లైన్ల కింద లేదా విద్యుత్ లైన్ల దగ్గర లేదా ట్రాన్స్ఫార్మర్ల దగ్గర మండపాల ఏర్పాటు చేయకూడదు.
2. మండపాల వద్ద నాణ్యత గల ఎర్త్ లీకేజ్ సర్క్యూట్ బ్రేకర్ అవసరమైన ఎంసీబీ లను అమర్చుకోవాలి .
3. మండపాల వైరింగ్ లైసెన్స్ పొందిన ఎలక్ట్రీషియన్‌తో చేయించుకోవాలి .
4. వైరింగ్‌లో జాయింట్లు లేకుండా ఉండేటట్లు ఏర్పాట్లు చూసుకోవాలి.
5. రేటెడ్ కేబుల్ వైర్లు , ఇన్సులేషన్‌తో కనెక్ట్ చేయబడిన లోడ్ల ప్రకారం ఉపయోగించాలి.
6. తీగలకు హుక్కింగ్ లు వేయకూడదు .
7. విద్యుత్ వైర్లు ఇనుప పైపులను తాకకూడదు. అవసరమైతే, తాకే ప్రదేశాలలో సరైన ఇన్సులేషన్ ఉండేటట్లు వైరింగ్ ఉండాలి .
8. వైర్లను నేలపై తాకకుండా చూసుకోవాలి . తప్పనిసరి అయితే మాత్రమే జాయింట్ లు లేకుండా వైర్లు వెళ్లేలా సరైన జాగ్రత్తలు తీసుకోవాలి.
9. సరైన ఎర్తింగ్‌తో త్రి పిన్ ప్లగ్‌లను ఉపయోగించండి.
10. మండపాల నిర్మాణం కోసం ఏదైనా ఇనుప పైపులను ఉపయోగిస్తే, విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌ను నివారించడానికి వాటిని ఇన్సులేటెడ్ మెటీరియల్‌తో కప్పాలి.
11. సర్వీస్ వైర్‌ను స్తంభానికి బిగించిన తర్వాత, సంబంధిత ప్రాంత లైన్‌మెన్ లేదా జెఎల్ఎం కి తెలియజేయకుండా ఎటువంటి మార్పులు చేయకూడదు.
12. ఏదైనా ఇన్వర్టర్ లేదా జనరేటర్ ఉపయోగించినట్లయితే, రిటర్న్ కరెంట్ వెళ్లకుండా సరైన జాగ్రత్తలు తీసుకోవాలి.
13. అన్ని ఇన్‌స్టాలేషన్‌లు సరిగ్గా, పరిపూర్ణంగా ఉండేలా చూసుకోండి.
14. తడి చేతులతో విద్యుత్ స్విచ్‌లు/స్విచ్ బోర్డులు లేదా ఏదైనా విద్యుత్ పరికరాలను తాకవద్దు.
15. పిల్లల భద్రత కోసం సరైన ఎత్తులో స్విచ్ బోర్డులను అమర్చండి.
16. ప్రతి గణేష్ మండపాల వద్ద భద్రతా జాగ్రత్తలు ఫ్లెక్సీలు / పోస్టర్‌లను ఏర్పాటు చేయండి.
17. మండపాల విద్యుత్ సరఫరా ఇచ్చే ముందు, వైరింగ్‌ను సంబంధిత ప్రాంత ఏడీఈ సిబ్బంది తనిఖీ చేయాలి.
18. ప్రతి మండపాల ప్రవేశద్వారం వద్ద, అవసరమైన సహాయం కోసం టోల్‌ఫ్రీ నంబర్ 1912, సంబంధిత ఏఈ ఆపరేషన్, ఏరియా లైన్‌మెన్, జెఎల్ఎం ఫోన్ నంబర్‌లను ఉండాలి.

# వినాయక చవితి శుభాకాంక్షలు

## ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**ఖమ్మం, మహా:** రాష్ట్ర ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు. ప్రతి ఒక్కరి జీవితంలో ఏర్పడే సకల విఘ్నాలను వినాయకుడు తొలగించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వినాయకుడిని ప్రార్థించారు. పరమ పవిత్రమైన వినాయక చవితి పర్వదినం సందర్భంగా మనందరం ఇళ్లలో మట్టి వినాయకుడిని పూజిద్దామని ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క పిలుపు నిచ్చారు. మట్టి వినాయకుడిని పూజించడం పర్యావరణంకు మేలుచేయడంతో పాటు అది మన సంస్కృతి అని చెప్పారు. రాష్ట్రం లోని ప్రతి మండపంలోను మట్టి వినాయ కులను పెట్టి పూజించి మన సంస్కృతిని, పర్యావరణాన్ని కాపాడు కుందాం అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. ఊరూరూరా వెలసిన వినాయక మండ పాలను ఈ ఏడాది ప్రజా ప్రభుత్వం ఉచిత విద్యుత్‌ను అందిస్తోంది. వినాయక మండప నిర్వహకులు అందరూ అధికారు లు సూచించిన భద్రతా ప్రమాణా లు అన్ని పాటించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు.



# గర్భస్థ లింగ నిర్ధారణ చట్ట వ్యతిరేకం

## జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ కళావతి బాయి








**ఖమ్మం, ఆగస్టు -26, మహా:** గర్భస్థ లింగ నిర్ధారణ చట్ట వ్యతిరేకమని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ బి. కళావతి బాయి అన్నారు. కలెక్టరేట్ లోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి కార్యాలయంలో మంగళవారం గర్భస్థ పూర్వ, గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం పరిధి జిల్లా అడ్వైజరి కమిటి సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ఉన్న స్కానింగ్ కేంద్రాలలో జరిగే ప్రతి స్కానింగ్ కు సంబంధించి ఫారం ఎఫ్ రూపొందించి ఆన్ లైన్ లో నమోదు చేయాల్సి ఉంటుందని అన్నారు. ఖమ్మం జిల్లాలో జరిగే ప్రసవాలలో వెయ్యి మంది మగ పిల్లలకు 988 మంది ఆడ పిల్లలు జన్మిస్తున్నారని, గర్భస్థ శిశువుగా ఉన్నప్పుడు స్త్రీ, పురుష లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లయితే పరీక్షలు చేసిన వారికి, చేయించుకున్న వారికి, అందుకు ప్రోత్సహించిన వారికి చట్టప్రకారం మూడు సంవత్సరాల వరకు జైలు శిక్ష, పది వేలు జరిమాన విధించబడుతుందని,అలాగే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. లింగ నిర్ధారణ అరికట్టుటకు ప్రతి నెల స్కానింగ్ సెంటర్లను కార్యాలయ సిబ్బంది, బృందంతో తనిఖీ నిర్వస్తున్నామని అన్నారు. జిల్లాలోని ఆసుపత్రులలో జరుగుతున్న అబార్షన్ కేసులను సైతం స్టడీ చేసి ఎక్కడైనా లింగ నిర్ధారణ కారణంగా అబార్షన్ జరిగిందా అని పరిశీలించాలని డిఎంహెచ్ఓ తెలిపారు. అధికంగా అబార్షన్ జరిగే ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులకు లింగ నిర్ధారణ చేయకుండా ఉండే విధంగా చట్టం పై పూర్తి అవగాహన కల్పించాలని, లింగ నిష్పత్తి సమానమయ్యే దిశగా కృషి చేయాలని, ఏ స్కానింగ్ కేంద్రంలో అధికంగా స్కానింగ్ లు అవుతున్నాయో పరిశీలించి ఆకస్మిక తనిఖీలు చేయాలని అన్నారు. జిల్లా సంక్షేమ శాఖ ద్వారా ప్రజల్లో ఆడపిల్ల అదృష్టమనే అవగాహనతో పాటు ప్రజల్లో చైతన్యం తేవాలన్నారు. పోస్టర్లు, కరపత్రాల ద్వారా చట్టం పై అవగాహన, ఆడపిల్లలు మగపిల్లలతో సమానమేనని, అవకాశం ఇస్తే అన్ని రంగాల్లో రాణిస్తారనే విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. గర్భిణీ లపై అంగన్వాడీ, ఆశా లు ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఎక్కువగా 5, 6 వ నెలల్లో అబార్షన్ లకు అవకాశం ఉంటుందని, వీరు పరీక్షలకు వచ్చేలా ఫాలో అప్ చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి కె. రాంగోపాల్ రెడ్డి, డిసిహెచ్ఎస్ డా. రాజశేఖర్, పీవో ఎంసిహెచ్ డా. చందు నాయక్, పీవో ఎన్సివి డా. పి. వెంకట రమణ, ఏడి కె. శ్రీనివాసరావు, డిఎంసి ఎస్డీ. సమీన్, జాగృతి ఎన్జిఓ ఎం. కుముదిని, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# మహిళలు ఆర్థికంగా ఎదగాలి

**ఖమ్మం , ఆగస్టు -26, మహా:** మహిళలు లాభసాటి వ్యాపారాలను ప్రారంభించి ఆర్థికంగా బలోపేతం కావాలని, మరొకరికి ఉపాధి కల్పించే విధంగా అభివృద్ధి చెందాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మంగళవారం ఖమ్మం నగరం టేకులపల్లి లోని దుర్గాబాయి మహిళా, శిశు వికాస కేంద్రం మహిళా ప్రాంగణంను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సందర్శించారు. మహిళా ప్రాంగణం పరిసరాలను కలియ తిరిగిన కలెక్టర్, ప్రాంగణానికి కావలసిన మౌళిక సదుపాయాల గురించి మహిళా ప్రాంగణం మేనేజర్ ను అడిగి తెలుసుకున్నారు. మహిళలకు అందిస్తున్న వృత్తి విద్యా కోర్సులు, ఉపాధి శిక్షణ టైలరింగ్, మల్టీఫర్పస్ హెల్త్ వర్కర్స్ శిక్షణ, ఏఎన్ఎం నర్సింగ్, స్పోకెన్ ఇంగ్లీష్, టైపింగ్, ట్యాలీ, అకౌంటింగ్, కంప్యూటర్, డీసీఏ, డీటీపీ, డ్రైవింగ్, బ్యూటిషీయన్, మగ్గం వర్క్స్, తదితర కోర్సులు, టీచింగ్ రూమ్స్, వసతి గృహం, డైనింగ్ హాల్ లను పరిశీలించారు. గ్రామీణ ప్రాంత మహిళలకు వ్యవసాయ రంగంలో వినూత్న పద్ధతుల ద్వారా అధిక ఆదాయం సాధించేందుకు, స్వయం ఉపాధికి అందిస్తున్న డ్రోన్ శిక్షణను కలెక్టర్ పరిశీలించారు. డ్రోన్ పైలెట్ శిక్షణ వివరాలను మహిళలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ 2047 నాటికి దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 100 సంవత్సరాలు పూర్తయ్యే నేపథ్యంలో మన తెలంగాణ రాష్ట్రం ట్రిలియన్ డాలర్ ఎకానమీగా ఎదిగి దేశాభివృద్ధికి మనం తోడ్పాటు అందించాలనే లక్ష్యంతో తెలంగాణ రైజింగ్ 2047 పాలసీతో ప్రభుత్వం ముందుకు వెళుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే మహిళల వర్క్ ఫోర్స్ పెరగడం చాలా కీలకమని అన్నారు. ఆర్థిక వ్యవస్థలో మహిళలను భాగస్వామ్యం చేయడం వల్ల ప్రగతి చాలా రెట్లు పెరుగుతుందని అన్నారు. వ్యాపారవేత్తలుగా మహిళలు ఎదిగితే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా శిక్షణ తీసుకుంటున్న మహిళలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. నర్సింగ్, కంప్యూటర్ విద్య, టైలరింగ్‌లో శిక్షణ పొందుతున్న మహిళలతో పలు అంశాలు చర్చించానని, ఇక్కడ డ్రోన్ వాడకంపై కూడా శిక్షణ అందించడం అభినందనీయమని అన్నారు. వ్యవసాయ రంగం ఖమ్మం జిల్లా ఆర్థిక వ్యవస్థకు కీలకమని, 6 లక్షల ఎకరాల వ్యవసాయ భూమి ఉందని, సంవత్సరానికి సరాసరి 10 లక్షల ఎకరాలు సాగు అవుతాయని అన్నారు. ప్రస్తుతం రైతులకు కూలీలు దొరకడం లేదని, వ్యవసాయ రంగం యాంత్రికరణ వైపు వెళుతూందని, డ్రోన్ వినియోగిస్తే ఒక ఎకరం భూమిలో పురుగు మందు పిచికారీ 15 నిమిషాల్లో చల్లవచ్చని అన్నారు. ప్రస్తుతం డ్రోన్ ద్వారా మందులు పిచ్చికారీ చేయడానికి ఎకరానికి 500 రూపాయల వసూలు చేస్తే మన జిల్లాలో సంవత్సరానికి 150 కోట్ల వరకు గరిష్టంగా వ్యాపార అవకాశాలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. డ్రోన్ వాడకం వల్ల ఒక రోజు దాదాపు 15 వేల వరకు సంపాదించవచ్చని, నెలలో 20 రోజులు పని చేస్తే కలెక్టర్ కంటే 3 రెట్లు ఎక్కువ సంపాదించవచ్చని అన్నారు.నానో యూరియా వాడకం డ్రోన్ ద్వారా సాధ్యం అవుతుందని, రాబోయే రోజుల్లో డ్రోన్ వినియోగం పెరుగుతుందని అన్నారు. టీవి, సెల్ ఫోన్ లాగా డ్రోన్ కూడా రాబోయే రోజుల్లో సర్వ సాధారణం అవుతుందని అన్నారు. డ్రోన్ శిక్షణ తర్వాత అభ్యర్థులు తాము ఉపాధి పొందుతూ భవిష్యత్తులో మరొకరికి ఉపాధి అందించే స్థాయికి ఎదగాలని కలెక్టర్ ఆకాంక్షించారు. వ్యాపార రంగంలో లాభార్జనే ధ్యేయంగా ముందుకు వెళ్లాలని, కస్టమర్లలో నమ్మకం కలిగించాలని, వ్యాపారం చేసే సమయంలో మనకు దానిపై సంపూర్ణ అవగాహన ఉండాలని, ఆ దిశగా మన నైపుణ్యతను పెంచుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా ప్రాంగణం మేనేజర్ వేల్పుల విజేత, సిబ్బంది సరస్వతి, స్పందన, మల్లిక, విజయ్ కుమార్, సుధీర్, సుకన్య, మౌనిక, లాలయ్య, జయ, శారద, అనిత, దుర్గారావు, శాంతమ్మ, కళ్యాణి తదితరులు ఉన్నారు.









# జంగిల్ క్లియరెన్స్ చేయండి

**నేలకొండపల్లి, ఆగస్టు 26 మహా:** పిచ్చి చెట్లు తో రహదారి కనిపించకుండా... ప్రమాదాలకు నిలయంగా మారాయని...ప్రజలు ఆరోపిస్తున్నారు... జంగిల్ క్లియరెన్స్ చేపించండి... లేదా రోడ్డైనా మూసేయ్యాలని పలువురు డిమాండ్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలం లోని రాయగూడెం-చెరువుమాధారం గ్రామాల మధ్య రహదారి కి ఇరువైపులా చెట్లు ఏపుగా పెరిగి రహదారి కనిపించటం లేదు. దీంతో వాహనాలు ఢీకొని ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రహదారి ద్వారా రాయగూడెం, కొంగర, కట్టుకాచారాం, అప్పలనరసింహాపురం గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. ప్రమాదాలకు నిలయంగా మారిన రహదారిలో ఇరువైపులా పెరిగిన చెట్లు ను వెంటనే తొలిగించాలని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆయా గ్రామస్తులు వాపోతున్నారు..మంగళవారం రహదారి వద్ద స్థానికులు నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చెట్లు ను తొలిగించకపోతే... కనీసం రహదారి ని మూసివేయాలని పలువురు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో షేక్ హుస్సేన్, బోయిన బలరాం, తీగ రమణయ్య, బోయిన వేణు, ప్రధానపు నాగయ్య, తీగ వెంకటేష్, శీలం వెంకటనర్సయ్య..ప్రసాద్. రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్యంపై దృష్టి సారించండి



**నేలకొండపల్లి, ఆగస్టు 26 మహా:** గ్రామాలలో పారిశుద్ధ్యం పై దృష్టి సారించాలని బీజేపీ మండలాధ్యక్షుడు పాగర్తి సుధాకర్ అధికారులను కోరారు. మండలం లోని చెరువుమాధారం లో మంగళవారం పారిశుద్ధ్యం ను పరిశీలించారు. అధ్వానంగా ఉన్నా డ్రైయినేజీలను, పేరుకపోయిన చెత్తచెదారం ను పరిశీలించారు. పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు.' అనంతరం స్థానిక పంచాయతీ కార్యదర్శి కి వినతి పత్రం ను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...పారిశుధ్యం లోపించటం వలన ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారని అన్నారు. ఏ' వీధి చూసిన ఏముంది గర్వకారణం అన్నట్లు గా వీధులన్ని కంపు కొడుతున్నాయని అన్నారు. గ్రామాలలో హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన తీవ్రతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంచార్జీ గెల్లా నాగసాయి మండల ప్రధాన కార్యదర్శి మల్లెబోయిన గోవిందరావు, బాజా రామకృష్ణ, మండల ఉపాధ్యాక్షుడు కొండా హర్షవర్ధన్, అల్లి భూలక్ష్మి, పురాణం దివాకర్, కళ్యాణం నాగేశ్వరరావు, కందరబోయిన వెంకటరమణ, లక్ష్మినారాయణ, బానోత్ శ్రీను, గెల్లా మధు తదితరులు పాల్గొన్నారు.





# జాతీయ రహదారిపై కారు బోల్తా

**ముదిగొండ ఆగస్టు 26మహా :** జాతీయ రహదా రి ముదిగొండ వద్ద మంగళవారం కారు బోల్తా పడింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులకి ఎలాంటి ప్రమాదం జరగకుండా క్షేమంగా బయటపడ్డారు. ఇరువురికి తృటిలో ప్రమాదం తప్పడంతో ఊపిరి పిలుచుకున్నారు. వరంగల్ జిల్లా నర్సంపేట నుండి కారులో విజయవాడ వెళ్తుండగా ఈసంఘటన జరిగింది.

## జాతీయ రహదారి ప్రమాద స్థలాన్ని పరిశీలించిన సీఐ మురళి



**ముదిగొండ ఆగస్టు 26 మహా:** సూర్యాపేట జిల్లా కోదాడ నుండి ఖమ్మం వరకు ముదిగొండ మండల సమీప గ్రామాల ఆనుకొని కేంద్ర ప్రభుత్వ నిధులతో జాతీయ రహదారి (బైపాస్) నిర్మాణం చేశారు.ఈజాతీయ రహదారి నిర్మాణం పూర్తయి వాహనాలు రాకపోకలు కొనసాగుతున్నాయి. ఈక్రమంలో జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది.ఇటీవల కాలంలో జాతీయ రహదారిపై అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయి.కాగా గోకినేపల్లి గ్రామ సమీపాన జాతీయ రహదారి అండర్పాస్ ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఇటీవల కాలంలో కారు బోల్తా పడి ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన విషయం విధితమే. జాతీయ రహదారి ప్రమాద స్థలాన్ని సీఐ వడ్డేపల్లి మురళి మంగళవారం సందర్శించి పరిశీలించారు.

## జీపీ కార్మికుని కుటుంబానికి ఆర్ధికసాయం



**కారేపల్లి, మహా:** కారేపల్లి గ్రామపంచాయతీ లో మృతి చెందిన మాజీ కార్మికుడు ఆదెర్ల వెంకటయ్య కుటుంబానికి ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు మేదరి వీరప్రతాఫ్ (టోనీ) ఆర్ధిక సాయం అందించారు. మంగళవారం వెంకటయ్య కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ ఆదేశాలతో వెంకటయ్య సంస్మరణ కార్యక్రమాన్ని ఆర్ధికసాయం చేశారు. ఈకార్యక్రమంలో సొసైటీ డైరక్టర్ అడ్డగోడ ఐలయ్య, కాంగ్రెస్ పార్టీ వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు సురేందర్‌మనియార్, తాజుద్దీన్, మాడే సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ మండపాలలో విద్యుద్ఘాతాలకు అస్కారం ఇవ్వవద్దు: ఏఈ కే.సుధాకర్‌రెడ్డి



**కారేపల్లి, మహా:** గణేష్ మండపాల వద్ద విద్యుద్ఘాతాలకు అస్కారం ఇవ్వవద్దని కారేపల్లి ట్రాన్స్‌కో ఏఈ కర్నాటి సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కారేపల్లి క్రాస్‌రోడ్ లోని సబ్ స్టేషన్ లో విలేకరులతో మాట్లాడుతూ విద్యుత్ లైన్ల కింద, ట్రాన్స్ఫార్మర్ల దగ్గర మండపాల ఏర్పాటు చేయవద్దని కోరారు. మండపాల వైరింగ్ లైసెన్స్ పొందిన ఎలక్ట్రీషియన్‌తో చేయించుకోవాలని సూచించారు. వైరింగ్‌లో జాయింట్లు లేకుండా జాగ్రత్త పడాలన్నారు. కరెంట్ తీగలకు హుక్కింగ్ వేసి విద్యుత్ వాడకం ప్రమాదమని తెలిపారు. మండపాల వద్ద ఎర్తింగ్‌తో త్రీ పిన్ ప్లగ్‌లను ఉపయోగించాలన్నారు. సర్వీస్ వైర్‌ను స్తంభానికి బిగించిన తర్వాత, సంబంధిత ప్రాంత లైన్‌మెన్ కి తెలియజేయకుండా ఎటువంటి మార్పులు చేయవద్దన్నారు. ఇన్వర్టర్, జనరేటర్ వినియోగిస్తే రిటర్న్ కరెంట్ వెళ్లకుండా సరైన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రమాదాలు లేని పండుగను జరుపుకుందాన్నారు.

## పారిశుద్ధ్యం పై దృష్టి సారించండి



**నేలకొండపల్లి, ఆగస్టు 26 మహా:** గ్రామాలలో పారిశుద్ధ్యం పై దృష్టి సారించాలని బీజేపీ మండలాధ్యక్షుడు పాగర్తి సుధాకర్ అధికారులను కోరారు. మండలం లోని చెరువుమాధారం లో మంగళవారం పారిశుద్ధ్యం ను పరిశీలించారు. అధ్వానంగా ఉన్నా డ్రైయినేజీలను, పేరుకపోయిన చెత్తచెదారం ను పరిశీలించారు. పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు.' అనంతరం స్థానిక పంచాయతీ కార్యదర్శి కి వినతి పత్రం ను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...పారిశుధ్యం లోపించటం వలన ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారని అన్నారు. ఏ' వీధి చూసిన ఏముంది గర్వకారణం అన్నట్లు గా వీధులన్ని కంపు కొడుతున్నాయని అన్నారు. గ్రామాలలో హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన తీవ్రతం చేస్తామని హెచ్చరించారు. ఏరియా ఇంచార్జీ గెల్లా నాగసాయి మండల ప్రధాన కార్యదర్శి మల్లెబోయిన గోవిందరావు, బాజా రామకృష్ణ, మండల ఉపాధ్యాక్షుడు కొండా హర్షవర్ధన్, అల్లి భూలక్ష్మి, పురాణం దివాకర్, కళ్యాణం నాగేశ్వరరావు, కందరబోయిన వెంకటరమణ, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

# విఘ్నేశ్వరుని ఆశీర్వాదం భక్తి వైభవం

**ఖమ్మం,మహా:** ఇది కేవలం ఒక పూజా విధి కాదు, సాంస్కృతిక ఉత్సవం. కుటుంబం కలసికట్టుగా పూజల్లో పాల్గొనడం, గ్రామం మొత్తము ఒకే వేదికపై ఐకమత్యంగా నిలవడం, పట్టణాల లో వీధులు ప్రకాశవంతమైన మండపాలుగా మారడం – ఇవన్నీ కలిపి వినాయక చవితిని ఒక సామాజిక వేడుకగా మలుస్తాయి.

### వ్యాసమహర్షి నుండి బాల గంగాధర తిలక్ వరకు...

వినాయకుని పూజకు చరిత్ర ఎంతో ప్రాచీనమైనది. మహాభారతం రచన సమయంలో వ్యాసమహర్షి గణపతిని సృష్టి దేవతగా ఆవాహన చేసి మహాకావ్యం రాయించారని పురాణ గాథలు చెబుతాయి. ఈ గాథ వినాయకుని జ్ఞానాధిపతిగా ప్రతిష్ఠించింది. కాలక్రమంలో, శివ%–%పార్వతుల కుమారుడైన గణపతి భారతీయ సమాజంలో విఘ్నహర్త, శుభప్రారంభాల దేవుడిగా మారాడు. ఇంటి పూజల నుండి రాజసభల వరకు, చిన్న వ్రతాల నుండి మహోత్సవాల వరకు గణనాయకుని ఆరాధన తప్పనిసరి అయింది. చరిత్రలో ఒక కీలక మలుపు 19వ శతాబ్దంలో వచ్చింది. బాల గంగాధర తిలక్ వినాయక చవితిని సామూహిక పండుగగా ప్రారంభించారు. బ్రిటీష్ పాలనలో ప్రజల ఏకతా కోసం ఆయన వినాయక ఉత్సవాలను వేదికగా మలచారు. అక్కడి నుండి వినాయక చవితి కేవలం పూజ మాత్రమే కాదు, ప్రజా ఉద్యమానికి పునాది అయింది.

### పల్లెల నుంచి పట్టణం వరకు...

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లో వినాయక చవితి ఒక అపూర్వ దృశ్యాన్ని సృష్టిస్తుంది. ప్రతి గ్రామంలో గణపతి మండపాలు కొలువుతీరుతాయి. చిన్నారులు కీర్తనలు ఆలపిస్తుంటే, యువకులు వాలంటీర్లుగా సేవ చేస్తారు. గ్రామీణ వాతావరణంలో కలసికట్టుగా జరిగే పూజలు ఐక్యతా భావానికి ప్రతీకలు. పట్టణాలలో అయితే వినాయక ఉత్సవాలు వైభవంతో నిండిపోతాయి. హైదరాబాద్ ఖైరతాబాద్ గణేష్ దేశవ్యాప్త ప్రసిద్ధి పొందిన విగ్రహం. 60 అడుగులకు పైగా ఎత్తైన విగ్రహం ముందు లక్షలాది భక్తులు క్యూలైన్లలో నిల్చొని దర్శనం పొందుతారు. విజయవాడ, విశాఖపట్నం, వారంగల్, ఖమ్మం వంటి పట్టణాల్లోనూ విగ్రహాల ప్రతిష్ట భక్తి, కళాత్మకత కలయికగా ఉంటుంది.

### సాహిత్యం, సంగీతం, కళల్లో గణనాయకుడు

తెలుగు సాహిత్యంలో గణనాయకుని స్థానం అగ్రగణ్యమైనది. అన్నమయ్య కీర్తనలలో గణపతిని స్తుతించిన పద్యాలు ఉన్నాయి. తెనాలి రామకృష్ణ వంటి కవులు గణనాయకుని ప్రశంసిస్తూ మంగళపద్యాలు రచించారు. ఆధునిక సాహిత్యంలోనూ గణేశ గీతాలు ప్రత్యేక స్థానం సంపాదించాయి. కళలలో గణనాయకుడు సృజనాత్మకతకు ప్రతీక. చిత్రకళలో, శిల్పకళలో ఆయన రూపాలు విశిష్టతను చాటాయి. సంగీతంలో గణపతి వందనంతోనే ప్రతి కచేరీ ఆరంభమవుతుంది.

### మట్టి గణేష్, ప్రకృతి పరిరక్షణ.

ఇటీవలి కాలంలో వినాయక ఉత్సవాలు పర్యావరణహిత దిశగా మలుపు తిరిగాయి. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల నదులు కలుషితం అవుతున్న నేపథ్యంలో మట్టి విగ్రహాలకే ప్రాధాన్యం పెరిగింది. సహజ రంగులు, బయోడిగ్రేడబుల్ అలంకరణలు ఉపయోగించడం ప్రారంభమైంది. "మట్టి నుంచి పుట్టినవాడు %–% మట్టిలోకే లీనమయ్యే వాడు" అన్న భావనతో మట్టి గణపతి పూజకు భక్తులు మక్కువ చూపుతున్నారు.

### వినాయక మండపాల ద్వారా సేవా కార్యక్రమాలు.

వినాయక చవితి కేవలం పూజలకే పరిమితం కాకుండా, సామాజిక సేవా కార్యక్రమాలకు వేదికగా మారింది. పలు మండపాల్లో రక్తదాన శిబిరాలు, ఉచిత వైద్య శిబిరాలు, పేదలకు అన్నదానం, విద్యార్థుల కోసం క్విజ్, సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నారు. ఇది పండుగను సమాజానికి ఉపయోగకరమైనదిగా మార్చింది.

### ఉత్సవాల వెనుక ఖర్చులు, పోటీలు

వినాయక ఉత్సవాలు ఇప్పుడు రాజకీయ–ఆర్థిక కోణాల్లోనూ ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకున్నాయి. పెద్ద పట్టణాలలో మండపాల మధ్య ఎవరి విగ్రహం పెద్దది? ఎవరి అలంకరణ వైభవంగా ఉంది? అనే పోటీలు సర్వసాధారణం. లక్షల రూపాయలు ఖర్చవుతాయి. వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు ఈ ఉత్సవాలకు సహకరించి ప్రజలలో తమ గుర్తింపును పెంపొందించుకుంటారు. ఇది ఒకవైపు భక్తి, మరోవైపు రాజకీయ ప్రాధాన్యాన్ని కలిపిన ఉత్సవంగా మారింది.

### విఘ్నేశ్వరుని ఆశీస్సులతో కొత్త ప్రారంభం

వినాయక చవితి పర్వదినం ప్రతి భక్తుని జీవితంలో ఒక కొత్త ప్రారంభానికి సంకేతం. పది రోజులపాటు జరిగే వినాయక నవరాత్రి ఉత్సవాలు చివరిరోజు నిమజ్జనంతో ముగుస్తాయి. నదులు, చెరువులు, సముద్రతీరాలు "గణపతి బప్పా మోరియా – ముందా సంవత్సరంకి త్వరగా రా" అనే ఘోషలతో మార్మోగుతాయి. ఈ పండుగ మనకు ఒక సందేశం ఇస్తుంది – విఘ్నాలు వస్తాయి, కానీ వాటిని తొలగించేది మన విశ్వాసం, ఐక్యత, సృజనాత్మకత. వినాయకుని ఆశీస్సులతో ప్రతి మనసులో కొత్త వెలుగు, ప్రతి ఇంటిలో కొత్త శక్తి, ప్రతి సమాజంలో కొత్త ఐక్యత పుట్టుకొస్తుంది.

## ప్రజల ప్రాణాలను కాపాడేందుకు కలిసి శ్రమిద్దాం

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్ 26 (మహా):** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశించారు. ఐ డి ఓ సి కార్యాలయం సమావేశం మందిరంలో మంగళవారం జిల్లాస్థాయి రోడ్డు భద్రత కమిటీ సమీక్షా సమావేశం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా ముందుగా రోడ్డు భద్రతకు సంబంధించి, తీసుకుంటున్న చర్యల గురించి సంబంధిత శాఖ అధికారుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో మోటారు వాహనాలు వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో రహదారి ప్రమాదాలు నానాటికి అధికమవుతున్నాయన్నారు.




## పర్యావరణ పరిరక్షణ దిశగా అడుగులువేద్దాం

**భద్రాద్రి కొత్తగూడెం , ఆగస్ట్ 26 (మహా):** మట్టి విగ్రహాలతో వినాయకచవితి పండుగ జరుపుకోవండం ద్వారా పర్యావరణ పరిరక్షణ దిశగా అడుగులువేద్దామని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కార్పొరేషన్ పరిధిలోని పలు సెంటర్లలో ఏర్పాటు చేసిన మట్టి విగ్రహాల పంపిణి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం కూనంనేని మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్ర హాలతోనే పండగ జరుపుకోవాలని, కెమికల్స్, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ తో తయారు చేసిన విగ్ర హాలను ఏర్పాటు చేసుకొని పూజలు నిర్వహించడం కారణంగా పర్యావరణ కాలుష్యం విపరీతంగా పెరిగిపోతుం దని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, పలు స్వచ్ఛంద సంస్థల చొరవతో ప్రజల్లో అవగాహన పెరుగుతోందని, మరింత ప్రచారం కల్పించడం ద్వారా మట్టివిగ్రహాల ఏర్పాటును విస్తృతం చేయాలన్నారు.

## సింగరేణి సిఎంపిఎఫ్ అధికారుల సమన్వయ మరియు 3వ దశ ప్రయాస్ సమావేశం

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్ 26 (మహా):** సింగరేణి ప్రధాన కార్యాలయంలో మంగళవారం సింగరేణి ఉద్యోగుల మరియు కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై సిఎంపిఎఫ్ మరియు సింగరేణి యాజమాన్యం అధికారులతో సమన్వయ మరియు 3 వ దశ ప్రయాస్ సమావేశం నిర్వహించారు. ఈ యొక్క సమన్వయ మరియు 3 వ దశ ప్రయాస్ సమావేశంలో సి కేర్స్ ద్వారా రీఫండ్/పెన్షన్ క్లెయిమ్‌లను తప్పులు లేకుండా సకాలంలో మరియు దోషం లేకుండా సమర్పించడం, సిఎంపిఓ ద్వారా సవరించిన పి పి ఓ వితంతు పెన్షన్ క్లెయిమ్ జారీ చేయబడని వారు, మాన్యువల్ గా సమర్పించాలని, రిటర్న్ చేయబడిన క్లెయిమ్‌లను నిర్ణీత సమయంలోపు సమర్పించాలని, డిసెంబర్, 2025 లోపు పదవీ విరమణ చేయబోయే సభ్యులకు సంబంధించి అనెక్సర్ సమర్పించాలని, సి కేర్స్ లో వి వి స్టేట్‌మెంట్‌లు మరియు పి ఎస్ 5ని అప్‌లోడ్ చేయడం, సి కేర్స్ లో కాంట్రాక్టర్ కార్మికుల ప్రధాన డేటాను ఏర్పాటు చేయటం, సి కేర్స్ సభ్యుల లాగిన్ గురించి ఉద్యోగులకు అవగాహన కల్పించాన్నారు.

## ఎస్పీ ఎదుట 8 మంది మావోయిస్టుల లొంగుబాటు

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్ 26 (మహా):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు మరియు 81 మరియు 141 సి ఆర్ పి ఎఫ్ బెటాలియన్ అధికారులు ఆదివాసీ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కొరకు నిర్వహిస్తున్న "ఆపరేషన్ చేయూత" కార్యక్రమం ద్వారా లొంగిపోయిన సభ్యులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరియు పోలీసు శాఖ కల్పిస్తున్న సదుపాయల గురించి తెలుసుకుని, నక్సలిజాన్ని విడనాడి ఇకపై తాము కూడా కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంతమైన జీవితం గడపాలని నిర్ణయించుకొని వివిధ స్థాయిలలో పనిచేస్తున్న (08) మంది నిషేదిత , పీపీ సీఎం/ ఏ సీఎం ఒకరు, ఒక పార్టీ మెంబర్, మలేషియా మెంబర్లు ఆరుగురు మొత్తం ఎనిమిది మంది మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సమక్షంలో జనజీవన స్రవంతిలో కలిసారు.

## మారుమూల దట్టమైన అటవీ ప్రాంతాలలో నివసిస్తున్న గిరిజనులకు మౌలిక సౌకర్యాల కల్పన

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్ 26 (మహా):** ఏజెన్సీ ఏరియాలోని మారుమూల దట్టమైన అటవీ ప్రాంతాలలో నివసిస్తున్న గిరిజనులకు పీఎం ధర్తీ ఆభాజాన్ జాతీయ గౌరవ ఉత్కర్ష అభియాన్ పథకంలో భాగంగా గిరిజనులను చైతన్యపరిచి వారికి కావలసిన మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా సంబంధిత అధికారులు అవగాహన కల్పించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్ మరియు ఇతర అధికారులతో పీఎం ధర్తీ ఆభాజాన్ జాతీయ గౌరవ ఉత్కర్ష అభియాన్ కార్యక్రమం విజయవంతం అవ్వడానికి తీసుకోవలసిన కార్యాచరణ పై వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి అధికారుల చేత పిఎం ధర్తీ ఆభాజాన్ జాతీయ గౌరవ ఉత్కర్ష అభియాన్‌కి సంబంధించిన ప్రతిజ్ఞ చేయించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ఏరియా పరిధిలోని మారుమూల గ్రామాలు ఎక్కువగా ఉన్న 19 మండలాలలోని 134 గ్రామాలలో పిఎం ధర్తీ జిల్లాస్థాయి కమిటీ సభ్యులు మండల స్థాయిలో బ్లాకుల వారీగా కమిటీలు ఏర్పాటు చేసి వారికి శిక్షణ అందించి ఆ గ్రామాలలోని ప్రజలకు వారికి కావలసిన మౌలిక వసతుల గురించి అవగాహన కల్పించి ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు.